ఆ సాయంత్రం బస్‌స్టాండులో గళ్లషర్టుల బృందం ఆలపించిన పాట ఇంటికి వచ్చి అరగంటయినా చెవుల్లో గింగురుమంటూనే ఉంది. రోజూ వాళ్ల అల్లరికి, ఆకతాయితనానికి అలవాటు పడిపోయినా ఆ రోజెందుకో కొత్తగా బాధపడింది అనూరాధ మనసు.

“రంభా ఊర్వశులను తలదన్నే రమణీలలామ ఎవరీమె. . .” కర్ణకఠోరంగా పాడిందొక గొంతు. వెనువెంటనే మిగిలినవారి ఇకిలింపులు, పకిలింపులు. పెడన-మంగినపూడి బస్ కోసం 'స్టాప్'లో నిలబడిన అనూరాధ మనసు అవమానంతో రగిలిపోయింది. తను నిజంగా ఆ పాటకి దీటై ఉంటే గర్వపడేదేమో? కాని ఇప్పుడు తనా పాటకి, పాటలోని భావానికి ఏమాత్రం సరిపోదు. తన అందాన్ని చూసి వాళ్లు ఎగతాళిగా పాడారే కాని మరొకరిని ఉద్దేశించి కాదు—అనుకుంది. సౌందర్యాన్ని తాను సృష్టించిన ప్రాణులందరికీ సమాన వాటాలుగా పంచని బ్రహ్మదేవుడి పక్షపాతబుద్ధిని తిట్టుకుంది. అలాగే మానవత్వాన్ని, మర్యాదని కొందరికే వారసత్వంగా రాసిచ్చిన అతడి సంకుచిత మనస్తత్వాన్ని మనసారా శపించింది. ఎంత నచ్చచెప్పినా కలతపడిన మనసు అవమానాన్ని భరించలేకపోతూంది. ఏం చేయటం? కాలేజీ మానేస్తే. . . తన భవిష్యత్తుకి దెబ్బ అంటారందరూ. కాని నలుగురిలో తన హృదయం నాలుగు రకాలుగా ముక్కలవుతూందని వాళ్లకి తెలియదు. తనని అర్థం చేసుకోగలవాడు శివరావ్ ఒక్కడే... చిన్నప్పట్నించి వయసుతోపాటు పెరుగుతున్న కలిసిన మనసులు తమవి! అయితేనేం? అతని ఎదుట తన బలహీనతని చాటుకోలేదు.

ఆలోచనా స్రవంతిలో మునిగి అతడి రాకని గమనించలేదు అనూరాధ.

పావుగంట తరవాత పట్టలేక గట్టిగా నవ్వాడు శివరావ్. అందమైన వెన్నెలతోపాటు ఆమెకూడా ఉలిక్కిపడింది.

'ఓ. . . నువ్వా! ఎంతసేపయింది వచ్చి?' తేరుకుంటూ అడిగింది.

'ఎంతసేపయితేనేం కాని నిన్ను చూస్తూంటే నాకో కథ గుర్తు వస్తోంది!'

'ఏ కథ?' అప్రయత్నంగా అడిగేసి నాలిక కరుచుకుంది. తను పరధ్యానంగా ఉన్నప్పుడల్లా అతనా కథని చెప్పటమో, గుర్తు చేయుటమో చేస్తూంటాడు. పరధ్యానంగల భార్యాభర్తలు కలిసి ఎలాగో కాపురం చేస్తుంటారు — ఒక రోజు వాళ్లమ్మాయిని పంపవలసిందంటూ మామగారు కబురు చేస్తాడు. అప్పటికి ఆమెకి ప్రసవించే నెలలు. మర్నాడే బయలుదేరి వెళుతుంది. అక్కడికి వెళ్లిన తరవాత ఇతడామెని మరిచిపోయి తన గొడవలో పడి ఉంటాడు. అక్కడ భార్య కూడా అదే స్థితిలో చాలా రోజులు గడిపేస్తుంది. పుట్టిన పిల్లాడికి మూడవ నెల రాగానే తలిదండ్రులు బలవంతంగా తీసుకువచ్చి భర్త దగ్గిర దిగబెడతారు. 'వెళ్లేటప్పుడు ఒక్క దానివే వెళ్లావుగా, ఇప్పుడు ఇద్దరెలా వచ్చారు?', అంటూ ఆ పరధ్యానం భర్త ఆశ్చర్యపోతే—'మీరు మరీనండీ! నా కామాత్రం ఏం తెలుసు వీడు పుడతాడని?' అందిట. వెంట వచ్చిన మామగారు కాసేపుంటే తనని కూడా మరిచిపోయి తరిమేస్తారేమోనని వెంటనే తిరుగుప్రయాణం కట్టాడట! అసలా కథ ఉందో, లేదో తెలియదు కాని అది శివరావ్ కల్పించిందేనని అనూరాధకి అనుమానం. చిరుకోపంతో చూసిందతడివైపు. అనురాగం తొణికిసలాడుతున్న చూపులకి కరిగిపోయింది వెంటనే.

'నీ వెంత ఎగతాళి చేసినా నా పరధ్యానమంతా నీ గురించే, శివరావ్!' ఆమె గొంతులోని మార్దవానికి చలించిందతని మనసు. దగ్గరగా ఉన్న ఆమె



# ఆరాధన

వై. అమృతవల్లి

చేతిని అందుకుని ఆప్యాయంగా నొక్కాడు.

'శివరామ్!' మెల్లగా పిలిచింది.

'ఏమిటే, రాధా?'

'నీ కిది భావ్యం కాదు!'

'ఏది?'

'నా లాంటి అభాగ్యురాలి మనసులో ఆశలు రేపటం!'

'భయపడకు, రాధా! నీ ఆశలన్నీ తప్పక పండుతాయి!'

'ఏమో, అది నీ చేతుల్లోనే ఉంది!'

మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఉండి పోయాడు. 'అయితే నువ్వు నిశ్చింతగా ఉండమ్మా' అంటాడనుకున్న అనూరాధకి అతడి మౌనం నిరాశ కలిగించింది. లావణ్య రాకతో సంభాషణ పెంచటానికి ధైర్యం చాలక పత్రిక చేతిలోకి తీసుకుంది. చిరునవ్వుతో పలకరిస్తూ ఎదురుగా కుర్చీలో కూర్చుంది లావణ్య. వరండాలో పడుతున్న వెన్నెలలో విరిసిన జాజిపూవులా ఉన్న లావణ్యని ఆరాధన నిండిన చూపులతో పరికిస్తూ జవాబు లిస్తున్నా డతడు. అతడి పరధ్యానాన్ని గమనించి చటుక్కున తలెత్తి చూసింది అనూరాధ. లావణ్య తళుకులీను కళ్లలో దేనికోసమో వెదుక్కుంటున్నట్లున్న అతడి వాలకం ఆమె మనసుని చివుక్కుమనిపించింది. ఏదో పని ఉన్నట్లు లేచి లోపలికి వెళ్లి పోయింది.

ఆ రాత్రి పది దాటినా నిద్రాదేవి ఆమె దరి చేరటానికి జడిసి దూరంగా నిలబడింది. ఎంత ఆలోచించినా అనూరాధకి అతని మనసేమిటో అర్థం కాలేదు. 'ఎలాంటి పరిస్థితుల్లోనూ తను శివరామ్‌ని వదులుకోలేదు. ఇన్ని సంవత్సరాలుగా పెంచుకున్న మమతలకి, ప్రేమకి అతడే ప్రతినిధి. తనని మోసం చేయటం అనేది శివరామ్ విషయంలో నమ్మలేదు. తనంటే అతని కెంత ఇష్టమో ఎప్పుడో అర్థమైంది. తను చెప్పిన ప్రతి మాటా నిండుమనసుతో విశ్వసిస్తాడు. కాని. . . తనిలా అపార్థం చేసుకోవటం న్యాయం కాదు. అతని దగ్గర ఈ ఇంట్లో అందరికీ చనువుంది. అయినా ప్రతి విషయం ఈ రోజు తన కెందుకో కొత్తగానూ, బాధాకరంగానూ అనిపిస్తోంది. అతడు అక్కయ్య నలా చూడటం తనకి కొత్తేమీ కాదు. కేవలం అందమైన వస్తువుని చూసినప్పుడు కలిగే భావమే అప్పుడు అతని కళ్లలో కనిపిస్తోంది' అనుకుంది మనసుని సరిపెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ. అలిసిపోయిన ఆమె మనసు నిద్రాదేవిని ఆహ్వానించింది.

రాజారావు కలెక్టరాఫీసులో సిరస్తాదారుగా చేస్తున్నాడు. భార్య రుక్మిణమ్మ అతనికి అన్ని విధాల తగిన గృహిణి. కలిగిన దానిలోనే ముగ్గురు పిల్లల్ని గారాబంగా పెంచారు. పెద్దవాడు మధు బి. ఎస్‌సి. ఇంజనీరింగ్‌లోకి వచ్చాడు. ఆ తరవాత కూతురు లావణ్య, సౌందర్యరాశి. . . పి. యు. సి. తోచదువు చాలించి ఇంట్లోనే ఉంటోంది. ఆఖరిదైన అనూరాధ సుగుణాల ప్రోవు. కాని పేరులో ఉన్న అందం ఆమెలో చిన్నమెత్తు కూడా లేకపోవటం తెలిసిన తరవాత రుక్మిణమ్మకి ఆమె పెళ్లి ఒక సమస్యగా తయారయింది.

బాహ్య సౌందర్యానికి లోనైన మనిషి ఆత్మ సౌందర్యాన్ని గురించి ఆలోచించడు. ఆరాధనకు ఆత్మ సౌందర్యం సోపానమని తెలిసివచ్చే సమయానికి వయసు జరిగిపోనూవచ్చు; మనసు వడలిపోనూవచ్చు. వీటికి అతీతమైన ఆలోచన మనిషిలో ప్రారంభమైనప్పుడుగాని మనసిచ్చిన మగువలోని త్యాగం అర్థం కాదు.

'మా రాధ చక్కగా చదువుకుంటుంది. ఏ డాక్టరో అవుతుంది' అనేవాడు రాజారావు స్నేహితులతో. ఊహ తెలిసిన కొద్దీ రాధకికూడా అలాగే అనిపించ సాగింది. కష్టపడి చదువుకుని డాక్టరవాలని కలలు కనటం మొదలు పెట్టింది. వయసు తిరిగిన మలుపు ఆమె కలలని హఠాత్తుగా మరో మార్గానికి మళ్లించింది. ఆ మార్గంలో మొదట్లోనే ఎదురయిన శివరామ్ ఆ కలలకి అంకితమైపోయాడు.

బయట నలుగురిలో ఉన్నంతసేపూ 'ఇన్‌ఫీరియారిటీ' ఫీలవుతున్న అనూరాధకు చిరపరిచితుడూ, కుటుంబ స్నేహితుడూ అయిన శివరామ్ సాన్నిహిత్యంలో సంతోషంగా, ఉత్సాహంగా ఉండేది మనసు. అతడి సన్నిధిలో ఉన్నంత వరకు బయటి ప్రపంచాన్ని మరిచి పోతుంది. క్రమంగా భవిష్యత్తుమీద పెంచుకున్న విరక్తి కరిగి, కలలు కొత్త పంథాలో సాగి ఇన్‌ఫ్లుయన్స్ కలర్‌లో ఆమెని ఊరించసాగాయి. ఆ మత్తులో చుట్టూ ఉన్నవారి మనసులని, మాటలని, చేతలని గమనించాలనే ధ్యాసే లేకుండా పోయింది. 'తాను భయపడినా, సంతోషపడినా, సమాధానపడినా, సంతృప్తిపడినా . . . ఒక్క శివరామ్ విషయంలోనే,' అనుకుంటుంది తరుచుగా.

• • •

కాలేజీనుంచి వస్తూనే హాల్లో శివరామ్‌ని చూసి ఆనందంతో నిండి పోయింది అనూరాధ హృదయం. అయిదు నిమిషాల్లో పుస్తకాలు లోపల పెట్టి తిరిగి వచ్చింది.

'ఏమి టీవేళ ఆలస్యంగా వచ్చావు?' చిరునవ్వుతో ప్రశ్నించాడు.

'ప్రాక్టికల్స్ పూర్తి చేసుకుని వచ్చాను. ఉదయం క్లాస్‌కి లేట్‌గా వెళ్లాను!'

'రాగానే నాతో కబుర్లాడుతూ కూర్చుంటే మీ అమ్మగారు కోప్పడతారేమో!' సంశయిస్తూ అన్నాడు. రోషంతో కస్సుమని లేచింది.

'ఇష్టం లేకపోతే చెప్పరాదూ నాతో మాట్లాడటం? లేనిపోని అనుమానాలు అడ్డెందుకు?'

'ప్రతిదానికీ అలా అపార్థం చేసుకుంటావెందుకు, రాధా? అసలు ఇంత వరకు కూర్చున్నది నీతో మాట్లాడాలనేగా! కాని. . . ఇటు చూడు, మనం ఇది వరకులా చిన్నపిల్లలం కాదు. ఎదుటివారి మనసులో ఎలాంటి అపార్థాలకి అవకాశ మివ్వకుండా నడుచుకోవాలి! ఇదంతా నీ క్షేమం కోరే చెపుతున్నాను!'

మృదు మధురంగా సాగిపోతున్న అతని ఉపన్యాసాన్ని వింటూ కోపం మరిచి పోయింది.

'ఏం చేయను, శివరామ్! నీ ఎదురుగా కూర్చుంటే కాలంగలగలపారే సెలయేరులా గడిచిపోతుంది! ఈ ఒక్క విషయంలో ఎవరేమనుకున్నా నాకు ప్రమేయం లేదు. ఒకవేళ నే నిలా ప్రవర్తించటం నీకుకూడా ఇష్టం లేకపోయినా నేను మార్చుకోలేను.' మెల్లగా చెప్పినా ఎంతో దృఢంగా ఉన్నా యామె మాటలు. సమాధానం లేకుండా ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. మధు రాకతో వాతావరణం చైతన్యం కలిగింది. మౌనంగా లేచి లోపలికి వెళ్లిపోయింది. రెండు రోజులుగా శివరామ్ ప్రవర్తన అంటీముట్టని విధంగా ఉండటం అనూరాధ మనసుని కలిచి వేస్తోంది. అనవసరమైన ఆలోచనలకి తావీయకుండా

స్నానానికి దారి తీసింది. లావణ్య మధుకి, శివరావ్‌కి కాఫీ తీసుకువెళుతూ ఎదురయింది. చెల్లెళ్ళి చూసి చిన్నగా నవ్వింది.

'అమ్మ ఇప్పుడే అది ఎందుకు రాలేదో వెళ్లిరారా, చీకటి పడిపోయిందని నీ కోసం అన్నయ్యని నెడుతోంది.'

'చీకటి పడితేనేం— నా కేం భయం? అమ్మ ఎప్పుడూ అంతేగా! ఊరికే కంగారు పడిపోతుంది'అంటూ బాల్‌రూమ్ తలుపు వేసుకుంది.

స్నానం చేసి తల దువ్వుకుంటుంటే చటుక్కున ఏదో గుర్తు వచ్చి ముందు గదిలోకి పరుగెత్తింది అనూరాధ. కాళ్ళు పీకుతున్నా కష్టపడి చేసింది ప్రాక్టికల్స్. ఆ రీడింగ్స్ కాగితం పోతే ఇంకేమైనా ఉందా? అయినా తనకి రోజు రోజుకి శివరావ్ అన్నట్లు పరధ్యానం ఎక్కువై పోతూంది. అన్ని పుస్తకాలూ గబగబా వెదికింది. చివరి పుస్తకంలో దాక్కున్న రీడింగ్స్ కాగితం చూసి మనసు కుదుట పడింది. 'అనవసరంగా కంగారు పడ్డాను. అమ్మ తీరే నాదికూడా' అనుకుంది, అన్నీ సర్ది యథాస్థానంలో పెడుతూ. వెనక్కి తిరిగి రెండడుగులు వేసిన అనూరాధ కాళ్లకి హాల్లో జరుగుతున్న సంభాషణ బంధాలు వేసింది. అప్రయత్నంగా వింటూ నిలబడిపోయింది.

'నిన్న కనిపించలేదేం, లావణ్యా?'

'గుడికి వెళ్లాను, ఇంట్లో ఏమీ తోచటం లేదని!'

'నన్నడగకుండా వెళ్లటాని కెంత ధైర్యం!' ఆశ్చర్యం నటించాడు శివరావ్.

'ప్రతిదీ నిన్నడిగి చేయాలా?' ఆమె కంఠంలో ఎంత ప్రయత్నించినా కోపం నిలవలేదు.

'ఊఁ. . . ఇప్పట్నించి నేర్చుకుంటే గానీ అలవాటవదు!' కొంటెతనం తొంగి చూసింది మాటలో.

'అయితే సరే, రేపు సినిమా కెళుతున్నాను!' మెల్లగా అంటూంది లావణ్య.

'నేనూ వస్తాను.'

'నాతోనా!?'

'ఏం, అనుమానమా?'

'ఊహుఁ అది కాదు. అమ్మకి తెలిస్తే . . .?' ఆగిపోయింది మధ్యలోనే.

'సినిమాకి కలిసి వెళ్లటానికి ధైర్యం లేనిదానివి. . . తీరా చివరికి నన్ను ముంచేస్తావేమో?' చిరుకోపంతో అన్నాడు.

'అలా అనకు, శివరావ్! నీ కోసం నే నేమయినా చేయగలను. కాని, మా వాళ్లకి నీవు ఒక్కడివే కదా? నీవే వెనుదీస్తావేమోనని భయంగా ఉంది.' ఎందుకో ఆమె కంఠం వణికింది.

'ఒక విధంగా నే నిలా చేయటం వాళ్ళకి తీరని నష్టమే కాని, నీ కోసం ఎంతటి త్యాగమైనా చేయగలను, లావణ్యా! నన్ను నమ్ము.'

'నా వలన మా వాళ్ళకి పరువు పోవచ్చు. ఈ కులాంతర వివాహం వాళ్ల ప్రతిష్ఠని మంటగలపవచ్చు. దానివలన అనూరాధ పెళ్లి ఇంకా ఘోర సమస్య కావచ్చు. ఇవన్నీ తలుచుకుంటూంటే ఏదో పిరికితనం నన్ను ఆవహిస్తోంది. అన్నింటినీ పక్కకి నెట్టి నిన్ను చేరుకోగలనా అనిపిస్తోంది.'

కాస్సేపు నిశ్శబ్దం తరవాత ఆమెని ఓదార్చాడు శివరావ్.

'పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు, లావణ్యా! ఈ రోజుల్లో స్వార్థం చూసుకోకుండా ఎవరు బాగుపడుతున్నారు? సరే, నేను వెళ్లనా? సెంటర్‌లో మధు నా కోసం వెయిట్ చేస్తూ ఉంటాడు!'

'రేపు రావటం మానేయకు!'

'ఏమైనా విశేషమా?' కొంటెగా అడిగాడు.

'ఏం లేదు. నీవు రాని రోజు నా కెలాగో ఉంటుంది!'

'ఎలాగో అంటే?' రెట్టించాడు.

'ఛీ. ఫో! మరీ చిలిపివాడి వయిపోతున్నావు!'

'అలాగే వెళుతున్నాను, లావణ్యా, మై స్వీట్ లవ్! టాటా.'

మెట్లు దిగిన బూట్ల శబ్దం క్రమంగా దూరమైపోయింది.

అనూరాధ గుండెలు ఉద్వేగంతో కొట్టుకోసాగాయి. చలికాలమే అయినా, శరీరమంతా చెమటతో తడిసిపోయింది. పెదవులు వణికాయి. చైతన్యం లేని శిల్పంలా కిటికిరెక్కకి అనుకుని అలాగే నిలబడిపోయింది. క్రిందటి సాయంత్రం జరిగిన సంఘటన తలలో 'ఫిల్మ్ రీల్'లా తిరగసాగింది.

కాలేజీనుంచి రాగానే మామూలు పలకరింపులయిన తరవాత—'శివరావ్! రాత్రి నా కో మంచి కల వచ్చింది!' అంది తను.

'పరధ్యానం ఎక్కువైతే కలలకేం తక్కువలే! ఇంతకీ ఏమి టా బంగారు స్వప్నం?'

'బంగారం లేదు, వెండి కాదు. మామూలు తెలుగు సినిమాలో, ప్రత్యేకంగా ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన హనీమూన్ లాంటిదే!'

'అయితే, హనీమూన్ వెళ్లే బాధ తప్పింది కదూ?' చిలిపిగా నవ్వాడు. తీయని భావంతో తన గుండెలు ఝల్లుమన్నాయి.

'నా కంత అదృష్టం కూడానా, శివరావ్!' నిరాశగా అంది.

'పాపం! అలా అని తప్పించుకుందామనా? ఆ ఎత్తు లేం సాగవు, తెలుసా?' నిష్కపటంగా ఉన్న అత[illegible]నానికి, నిర్మలమైన చూపులకి మైమరిచి పోయింది.

'నాలో ఏం చూసి ప్రేమిస్తున్నావ్, శివరావ్!' సిగ్గుపడుతూ అడిగింది.

ఒక్క క్షణం అయోమయంగా చూసి వెంటనే నవ్వేశాడు.

'ప్రేమకి అర్థం నాకు సరిగ్గా తెలియదు, రాధా! నువ్వంటే నా కిష్టం. అంతే.'

'అయితే ... నీవు నన్ను ప్రేమించటం లేదా?' ఆత్రతగా చూసింది.

'చెప్పానుగా— ప్రేమ విషయంలో నా అభిప్రాయం?'

'ప్రేమకి, ఇష్టానికి చాలా వ్యత్యాసముంది, శివరావ్. అది తెలుసా పోనీ?'

'అవన్నీ నాకు తెలియవు. అనవసరంగా ఆలోచనలు పెంచుకుని మనసు పాడు చేసుకోకు!'

''నీవు నా కెప్పుడూ అందీ అందనట్లుగానే ఉండిపోతావు, శివరావ్' అనుకుంది మనసులో పైకనే సాహసం లేక. లావణ్య రాకతో సంభాషణ అంతటితో ఆగి పోయింది.

''నిన్నటికీ, ఈ రోజుకీ ఎంత తేడా! ఎందు కిలా నన్ను మభ్య పెడుతున్నాడు? నా నుండి ఏ మాశించి ఇలా ప్రేమ నటిస్తున్నాడు? 'లవ్ ఈజ్ బ్లైండ్' అంటారు— ఇదే కాబోలు! అదృష్టవంతురాల్ని. ఏమీ నష్టపోకముందే అతని ఉద్దేశ్యం బయట పడింది. ఇంత జరిగినా తన మనసులో అతనిమీద ద్వేషం కలగదేం? ఆశించిన ఫలితం పొందలేనప్పుడు హృదయంలోని ప్రేమ ద్వేషంగా మారుతుందంటారు. తన లో ఆ భావన

## జయోస్తు

### శనగన నరసింహస్వామి

నిన్న మొన్నటిదాక ఈ గున్నమావి
 తోటలో నున్న జాడయే తోపదెపుడు
సన్నసన్నగ వచ్చి రసాలశాఖ
కొలువు దీరితివోయి పుంస్కోకిలపతి!

పూర్వ చైత్రాగమంబును పొగడి పొగడి
అలసి నిద్రించినావొ నీడాంతరమున?
మౌన నియమము సాధింప మానసించి
విఘ్న భయమున దూరము వెడలినావొ?

కాక ఘూక కఠోర కర్కశవిరావ
మూర్ఛితంబైన ఈ వనభూమి యందు
నీవు గొంతెత్తినంతనే జీవనంబు
మెఱసె వాసంత శోభలు విరిసె దెసల

ప్రణయ విభ్రమ విరహైక భావగాన
మొల్ల దీ వీరభారత మొక్క నిమిష
మింక నీ గొంతు నుండి వర్షించుగాక!
విక్రమోదార శృంగార విమల గీతి

కాలమెఱిగి ప్రజావళి కాంక్ష లెఱిగి
గళము సవరించుకొను నవ కవన శిల్పి!
ఓయి! మధురాజ సుమ సభా గాయకాగ్ర
ణీ! పికాన్వయమౌళిమణీ! జయోస్తు! ★

రావటం లే దెందుకనో? నీ విజస్వరూపం తెలిసినా నీ మీది ప్రేమ పీసమెత్తు కూడా తగ్గకపోవటం నీ అదృష్టం, శివరావ్!' అనుకుంటుంటే అనూరాధలో దుఃఖం, ఆవేదన ఒక్కసారిగా వరదలా పొంగాయి. అంతలోనే బేలగా మారి పోయింది. 'నీ నీడలో భవిష్యత్తుని సుందరంగా మలుచుకున్న నే నేమయి పోను? నా జీవితాన్ని నీ సన్నిధిలో నందన వనంగా ఊహించుకున్న నన్నిలా అన్యాయం చేయటం నీకు భావ్యం కాదు, శివరావ్! ఈ ప్రపంచంలో న న్నర్థం చేసుకున్నది నీవే. నా సర్వస్వం నీవేనని నమ్మాను. నీ ప్రతి మాటా, చేష్ట భవితవ్యాన్ని, అనుభవించబోయే తీయని రోజులను కనులముందు సృష్టించి మనసుని తొందర పెడుతూంటే మైమరిచి మురిసి పోయాను. కాని, అవన్నీ నా కోసం కాదా? న న్నెందు కిలా అందంగా వంచి స్తున్నావ్, శివరావ్? నీ అనురాగం, ఆదరణ నిజమని నమ్మి ఎంతో గర్వ పడ్డాను. నిజంగా నా లాంటిదాని కవి ఆకా కుసుమాలని గ్రహించలేక పోయాను.'

గదిలో లైటు వేయటానికి వచ్చిన రుక్మిణమ్మ చీకట్లో కిటికీ దగ్గర నిలబడిన కూతుర్ని చూసి ఆశ్చర్య పోయింది.

'లైటు వేయకుండా చీకట్లో ఏం చేస్తున్నావే?'

గొంతు బరువుగా ఉన్నట్లు తోచి మౌనం దాల్చింది అనూరాధ. స్విచ్ ఆన్ చేసి తన పనిమీద వెళ్లిపోయింది రుక్మిణమ్మ. తల్లి అటు వెళ్ళగానే భారంగా నిట్టూర్చి తన గదిలోకి వెళ్లి తలుపులు బిగించి మంచంమీద వాలిపోయింది. గుండెల్లో పేరుకున్న దుఃఖం తిరిగి కన్నీటిరూపంలో ప్రవహించసాగింది. కాసేపటి తరవాత లేచి నిలబడింది. ఎదురుగా అద్దంలో ప్రతిబింబం వెక్కిరించింది. ఎర్రగా ఉబ్బిన కళ్ళు, కన్నీటితో తడిసి మలినంగా ఉన్న చెంపలు...వాడిన కలువలా లేదు. రంగు వెలిసిన బొమ్మలా ఉంది. తన ముఖం తనకే వికృతంగా, అసహ్యంగా తోచింది అనూరాధకి. గిరుక్కున తిరిగి మంచంమీద వాలి పోయింది.

మర్నాడు లంచ్ టైమ్‌లో ఇంటికి వచ్చింది. అప్పటికే రాధ కోసం వెయిట్ చేస్తూ హాల్లో కూర్చుని ఉన్న శివరావ్‌ని ఎప్పటిలా చిరునవ్వుతో పలకరించలేక పోయింది. మౌనంగా లోపలికి వెళ్లి పోయింది. భోజనం చేసి పుస్తకాలు తీసుకుని అతడి ముందునుంచే చరచరపోతున్న అనూరాధని చూసి విస్మయం చెందాడు శివరావ్. ఆ సాయంత్రంకూడా అతనికి దూరంగానే తిరిగింది. మూడు రోజులు నరకంలాగా బరువుగా గడిచిపోయాయి. ఏ క్షణాన అతడు చేరదీస్తే ఆ క్షణంలో అతడి ఒడిలో వాలిపోవాలనిపించేది. అనూరాధకి. కాని, శివరావ్ ఏమీ పట్టనట్లు ఉండిపోవటం అశనిపాతంలా తోచి విలవిల లాడిం దామె మనసు. నాలుగో నాడు విధి లేక తానే పలకరించింది.

'రేపు మంగినపూడి వెళదాం, వస్తావా? ఆదివారమేగా!'

మూడు రోజులుగా తనని తప్పించుకుని తిరుగుతున్న అనూరాధ ఒక్కసారిగా తనతో ప్రోగ్రామ్ వేస్తున్నందుకు ఆశ్చర్యపోయాడు.

'ఎందుకు?'

'నీతో మాట్లాడాలి!'



దీర్ఘాలోచన ఫోటో—ఎన్. గిరిధర్ (కాకినాడ-4)

ఆ రోజు ఆమె ప్రవర్తన వింతగా తోచింది. అయినా—'సరే, నీ ఇష్టం' అన్నాడు. ఆదివారం నాలుగు దాటిన తరవాత బస్సులో ఇద్దరూ మంగినపూడి చేరుకున్నారు. దిగి, ఇసకలో చాలా దూరం నడిచి ఒక చోట కూర్చున్నారు. సంధ్యా దేవి తన అందమైన చీరకొంగు ప్రకృతి మీద కప్పుతూంది. బెస్తవాళ్ళు రాత్రి ప్రయాణానికి వలలు, పడవలు సిద్ధం చేసుకుంటున్నారు. మూన్‌లైట్ కోసం వచ్చినవాళ్లు సరదాగా సరాగా లాడు కుంటున్నారు.

బయలుదేరిన దగ్గర్నుంచి మౌనంగానే ఉండిపోయా రిద్దరూ. చివరికి తానే మొదలుపెట్టాడు శివరావ్.

'ఈ ప్రశాంత వాతావరణంలో నీ మౌనం, ఈ సముద్రపు ఘోష నా కేవో కొత్త సంగతులు చెప్పక చెప్పుతున్నట్లున్నాయి.'

'అది నిజమే. నేను అందుకోసమే పిలుచుకు వచ్చాను. కాని, ఎలా చెప్పాలో తోచటం లేదు!'

ఆమె కూర్చున్న తీరులో, మాట తీరులో గోచరిస్తున్న నిర్లిప్తత, గాంభీర్యం ఏదో విశేషమే చెప్పబోతూందని తెలుపుతున్నాయి. ఇలాంటి సమయ మేదో వస్తుందని తాను మూడు రోజుల్నించి అనుకుంటూనే ఉన్నాడు.

'శివరావ్! మన మధ్య ఎన్ని సంవత్సరాల అనుబంధముందో చెప్పగలవా?' హఠాత్తుగా ప్రశ్నించింది.

'ఎందు కలా అడుగుతున్నావు?'

'ముందు నా ప్రశ్నకి జవాబు చెప్పు!'

'అది నీకూ తెలిసినదేగా? నేను చెప్పే దేముంది?'

'అయితే సరే, నీకు తెలియంది మరొకటుంది...'

'ఏమిటో త్వరగా చెప్పు. సస్పెన్స్‌లో పెట్టటం నీకు సరదా అనుకొంటాను!' నవ్వుతూ అన్నాడు.

''నా భవిష్యత్తే సస్పెన్స్‌లో ఉంది'' అనుకుంది మనసులో. పైకి— 'మన స్నేహాని కిది చివరి సాయంత్రం. ఇకమీద మనమధ్య దూరమే ఇద్దరికీ శ్రేయస్కరం. నన్ను మరిచి ఉండటం నీకు కష్టం కాదని తెలుసు. నిన్నెలా మరిచిపోగలనన్నదే నాకు తీరని సమస్య' అంది. ఆమె గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. మోకాళ్ళ మీద తల ఆన్చి నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూంది. అప్రయత్నంగా ముందుకి జరిగి ఆమె భుజాలమీద చేతులు వేశా డతడు. ఆప్యాయంగా నిమురుతూ, 'ఏం జరిగింది, రాధా? ఎందు కిలా నీలో నువ్వు బాధపడుతున్నావు? నాతో చెప్పవూ, ప్లీజ్!' అని అనునయంగా అడిగాడు. అయిదు నిమిషాలు గడిచినా పెదవి విప్పలేదు అనూరాధ.

'ఏమో అనుకున్నా గాని, నిజంగా ఈ సమయంలో నీ మౌనం అందంగా ఉంది. రాధా?' అంటూ ఆమె చేతిని తన చేతి లోకి తీసుకున్నాడు. అతడిని వారించలేక పోయింది. కాసేపాగి ఆమె చేతిని వదిలి వెనక్కి వాలి వెల్లకిలా పడుకున్నాడు శివరావ్. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు.

సంధ్యాదేవి నిష్క్రమణ కోసం ఎదురు చూస్తున్న రేరాజు మబ్బుల చాటునుండి తొంగిచూస్తున్నాడు. చలిగాలి సరుకు తోపుల్లోంచి రివ్వున శబ్దం చేస్తూ దూసుకువస్తూంది. వణుకుతున్న పెదవులను బిగపట్టి పైటకొంగు తలమీదుగా కప్పుకుంది అనూరాధ. చుక్కల్లోకి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగి ఉన్న అతడి దగ్గరగా కూర్చుంది. ఎంతసేపటికీ అతడు మళ్లీ పలకరించకపోవడం చూసి తానే పిలిచింది.

'శివరావ్!'

ఆమెవైపు తిరిగాడు. అతడి చేతిని గట్టిగా పట్టుకుంటూ, 'కంగ్రాచ్యులేషన్స్' అంది చిరునవ్వుతో.

'ఎందుకు!' ఆశ్చర్యపోతూ అడిగాడు.

'కాబోయే నీ పెళ్లికి!'

'అలాగా? వధు వెవరోకూడా నీవే చెప్పు.'

'నాకు తెలియదు ఎవరో! కాని నేను మాత్రం కాదు!' దృఢంగా పలికిం దామె కంఠం. అతడి ముఖం పాలిపోయింది. వెంటనే తేరుకుంటూ హఠాత్తుగా ఆమెని తనవైపు లాక్కున్నాడు. అదాటున కూర్చున్న రాధ నిస్సహాయంగా అతని మీద వాలిపోయింది. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూ మాటల కోసం వెదుక్కోసాగాడు. రెండు నిమిషాల తరవాత తిరిగి ఆమే మొదలుపెట్టింది.

'నీ మనసు నా నుండి కోరుకునే దేమిటో నాకు తెలుసు, శివరావ్! అయినా, నేను బాధపడను. కాని, తాత్కాలిక భౌతికానందం కోసం న న్నింకా మభ్య పెట్టటం నీకు భావ్యం కాదు. మగవాడివి, నీ కేం ఫరవాలేదు. ఎన్ని వేషాలేసినా, పెళ్లవగానే అన్నీ మరిచి కొత్తగా జీవించ గలవు. ఆడదానికి అది సాధ్యం కాదు, శివరావ్! తొలివలపు అర్పించిన ప్రియుడిని ఆమె జీవితం ఉన్నంతవరకు మరిచి పోలేదు. పరిస్థితుల ప్రభావం ఇరువురిని వేరుచేసినా, అతడిపట్ల ఆమె ఆరాధన మాసిపోదు. స్త్రీ జీవితంలో ఒకరినే

మనసార ప్రేమించగల దన్న విషయం ఎంత సత్యమో నా కిప్పుడు అర్థమైంది. ఆ సత్యాన్నే నమ్ముకుని భవిష్యత్తుని గడపగలను. కొన్ని రోజుల తరవాత నువ్వు పూర్తిగా పరాయివాడి వయి పోతే అప్పుడిలా నీ హృదయంలో తల దాచుకుని మనశ్శాంతి పొందే అధికారం నాకు ఉండదు. ప్లీజ్, నీ వేమీ చెప్పకు. నన్ను మాట్లాడనీ?' అంటూ సున్నితంగా అతడి నోటికి చెయ్యి అడ్డం పెట్టి, 'ఈ కాస్సేపు నీ మనసు నాదిగానే ఉండనీ. నీవు నా వాడిగానే ఉండాలి' అని అతని మెడచుట్టూ చేతులు వేసి గుండెలమీద తల ఆన్చి గట్టిగా కళ్ళు మూసుకుంది. ఆమె నుదుటిమీద చిన్న ముద్దు పెట్టుకున్నాడు శివరావ్.

'నా మీద ఇన్నాళ్ళకి నమ్మకం కలిగిందా, అనూ!'


'లేదు. ఉన్న నమ్మకం పోయేముందు ఈ కొద్ది క్షణాలు ఇంకా గాఢంగా నమ్మగలిగాను. మన స్నేహానికి, అనురాగానికి చిహ్నంగా. . . మిగిలిన నా జీవితానికి ఒక మధుర జ్ఞాపకంగా. . . ఈ మధుర క్షణాలు నే నెప్పటికీ మరిచిపోలేను. నా బ్రతుక్కిది చాలు. ఇకమీద నీ ఆరాధనే నా జీవన సాఫల్యం!'

చెప్పకుండానే తన మనసులోని సమస్య అనూరాధ అర్థం చేసుకున్నట్లు ఆమె మాటల వలన గ్రహించగలిగాడు. అందుకు ఒకవైపు సంతోషంగాఉన్నా, మరొకవైపు మనసులో బాధాతరంగాలు సముద్ర కెరటాల్లా లేచి పడ్డాయి.

'మరీ అంత నిర్దయగా మాట్లాడకు, రాధా! నా మనసేం కోరుకుంటుందో నిజానికి నాకే అర్థం కావటం లేదు. అజ్ఞానంతోనో, అవివేకంగానో ప్రవర్తించి నీ మనసుకు కష్టం కలిగించి ఉంటే మనఃస్ఫూర్తిగా మన్నించు. ఇంతకంటె ఈ పరిస్థితుల్లో ఏమీ చెప్పలేను. నన్ను నమ్మలేవా?' దీనంగా ఉన్న అతని స్వరం రాధ మనసుని కరిగించింది. ఆ సమయంలో ఆమె కళ్ళకి పసివాడులా కనిపించా డతను.

'ఇంటికి వెళ్ళేవరకు నీ వేం చెప్పినా నమ్ముతాను, శివరావ్! నువ్వు ఎవరి వాడివైనా. . . నాకు మాత్రం ఆరాధ్య దైవానివి నీవే! నా ఇంటి ద్వారాలు, హృదయ ద్వారాలు నీ కోసం ఎప్పటికీ తెరిచే ఉంటాయి. పరీక్షలై పోగానేఅమ్మ, నాన్న నాకు, లావణ్యకి పెళ్ళి చేసెయ్యా లనుకుంటున్నారు. కాని, నాకు వాళ్ళను కున్నంత త్వరగా సంబంధం కుదరటం సాధ్యం కాదు. ఎందుకో నీకూ తెలుసు. తా నెలా ఉన్నా, తన భార్య అందాలరాశి కావాలనుకోవటం ఈ కాలం యువకు లందరూ కోరుకునేదే! సరే, ఇలా చెప్పు కుంటూపోతే ఈ వేళ ఇంటికి వెళ్ళలేము. ఇంక పోదామా? బస్సు కోసం అక్కడొక అరగంట వెయిట్ చేయాలిగా!'

ఆమె ఒక్కొక్క మాట శివరావ్ గుండెల్లో వాడిబాణంలా దూసుకు పోతూంటే గిలగిల్లాడిపోయాడు. ఆమెని చుట్టి ఉన్న అతని చేతులు వదులయాయి. "దేవతలాంటి నిన్నిలా వేధిస్తున్నా, అమృతాన్ని చిలికి మరింత బాధపెడు తున్నావు, రాధా! ఇంతకంటె నన్ను కసిదీరా కొట్టినా, తిట్టినా సంతోషంగా భరించే వాడిని. నిజంగా నీ నిర్మలానురాగానికి నేను తగను. అందుకే ఇలా జరిగింది.' బరువుగా నిట్టూర్చుతూ అనుకున్నాడు.



రైతు బాంధవులు ఫోటో – ఎ. లారెన్స్ (కాళహస్తి)

'పద, శివరావ్, పోదాం!' లేచి నిలుచుంటూ మరోసారి పిలిచింది.

మౌనంగా లేచి రెండడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు. అతనినే తదేకంగా చూస్తూ నిలబడిపోయిన అనూ రాధ కళ్ళల్లో తడి వెన్నెల్లో మెరుస్తూ శివరావ్ హృదయాన్ని కదిల్చి వేసింది. చిరునవ్వుతో చేతులు ముందుకి చాపాడు. మరుక్షణం అతని చేతుల్లో ఇమిడి పోయింది. వేరు వేరు భావాలతో కరిగి పోయిన ఇరువురి మనసులు మూగ పోయిన వీణలే అయాయి.

'నా మనసుకి, వయసుకి, మమతలకి పొంతన లేకుండా చేయకు, భగవాన్! అన్నీ ఒకరిమీదే, ఒకరికే అర్పించ గలగాలి.' అతని కళ్ళనుండి జారిన రెండు కన్నీటిబొట్లు ఆమె తలమీద పడ్డాయి.

'క్షణికోద్రేకాలకి, భౌతికమైన అందా లకి, ఆనందానికి మగవాడు ఎంత త్వరగా బానిసై పోతాడో అంత త్వరగాను నిజం తెలుసుకుని అంతకు మించిన బాధ అనుభవిస్తాడు. అయినా, వాటిని కోరుకో కుండా ఉండలేడు' అనుకుంది అతని నుండివిడిపోతూ అనూరాధ.

* * *

'డియర్ శివరావ్,

నీ ఉత్తరం చదివాను. ఆ సాయంత్రం తరవాత మనం కలుసుకొనిగాని, మాట్లాడుకుని గాని మళ్ళీ జరగలేదు. అప్పుడే రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. లావణ్య పెళ్లితో గాయపడిన నీ మనసు కోలుకుందనుకోవటానికి నీవు వ్రాసిన ఉత్తరం, దానిలో పొందు పరిచిన అభ్యర్థన, ఆవేదన, ఆశయాలే నిదర్శనాలు. ఇలాంటి రోజు కోసమే నే నిన్నాళ్ళూ ఎదురు చూశాను. కాని, నీ అభ్యర్థనని, కోరికని మన్నించగలిగే సమయం దాటిపోయింది. 'మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అన్న సూక్తి లావణ్య విషయంలోనేగాక నా విషయంలో కూడా మరోసారి ఋజువయింది. ఎంతగా ప్రేమించినా భార్యగా స్వీకరించలేని నీ కంటె సహృదయుడు ఎవరా అని ఆశ్చర్య పోతున్నావు కదూ? ఆయన. . . కృష్ణమూర్తి. అంటే నా కాబోయే భర్త. నా కంటే వెయ్యి రెట్లు అందగాడు. రెండు బంగళాలు, కార్లు, కంపెనీల్లో షేర్లు—అన్నీ ఉన్న ఆస్తిపరుడు. ఎమ్. ఎస్‌సి. పాసయి అమెరికాలో ఒక సంవత్సరం రీసెర్చి చేశారు. లక్ష్మీసరస్వతులకి తనయుడే కాకుండా మన్మథుడితో పోటీ పడే సౌందర్యం. . .అతనిని భర్తగాపొందటం అందరూ నా అదృష్టమంటున్నారు. కాని . . .అతడు నాలో లేని అందమే కాదు, తనలో ఉన్న అందాన్ని కూడా చూడలేని విషయం తెలిసినా, నేను మనఃస్ఫూర్తిగానే అంగీకరించాను. ఎందుకంటే, బాహ్య సౌందర్యాన్ని చూసి ప్రేమించేవారికి మానసిక సౌందర్యంతో పనిలేదు. అవసరం కూడా ఉండదు. రీసెర్చి పుణ్యమా అంటూ అంధుడైన అతడు నా భర్తగా లభిస్తున్నాడు. అదే జరగకపోతే అతని కాలిగోటికైనా నేను అర్హురాలిని కాగలిగే దాన్ని కాదు. ఏదో ఒక విధంగా అమ్మ, నాన్నల బరువుని దించగలుగుతున్నాను. ఆయన ఇంటికి జ్యోతిగా, కంటి వెలుగుగా నిలిచిపోవాలనే కోరికతో ఈ వివాహానికి అంగీకరించాను.

ఆ సాయంత్రం చెప్పిన మాటలన్నీ నాటకం అనుకుంటున్నావు కదూ? నీ లాగ నటించడం నాకు రాదు. అవన్నీ ఎప్పటికీ నాలో ఒక్కలాగే నిలిచి ఉంటాయి. నీవు ఎప్పుడు వచ్చినా నిండు మమతతో ఆహ్వానిస్తాను. శుభలేఖ త్వరలో వస్తుంది. తప్పక రమ్మని నిన్ను కోరలేను. నీ ఇష్టం.

ఇంక ఉంటాను.

—అనూరాధ.'

ఇదంతా జరిగి పది సంవత్సరాలైనా, అనూరాధ మనసుకి నిన్నా, మొన్నా జరిగినట్లుగానే ఉంటుంది. ఒక అభాగ్యుని పాలిట అదృష్టదేవతగా తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూ నిరంతరం గతాన్ని తలచు కొంటూనే ఉంటుంది. ఆమె తీయని మాటల్ని, సన్నిధిలోని వెచ్చదనాన్ని గ్రహించగలిగిన కృష్ణమూర్తికి ఆ మాటల వెనక మనసులోని అగాధాలు, తన సన్నిధిలో ఆమె ముఖంలో కదలాడే భావాలు అర్థం కావు; అతడు చూడలేడు.

'ఆమె తన పాలిట దేవుడు ప్రసాదించిన వరం!' అనుకుంటాడు భార్య ఆప్యాయంగా తనని దగ్గరికి తీసుకుని తను చూడాలను కున్న వాటిని తీయని స్వరంతో వర్ణించి చెప్తుతున్నప్పుడు.

'రాధా, ఏం చేస్తున్నావ్?' అంత వరకు మీటుతున్న వీణెలు పక్కన ఉంచుతూ పిలిచాడు. 'ఇక్కడే ఉన్నాను. ఏం కావాలి!' అలమారల్లో దేని కోసమో వెదుకుతూ జవాబిచ్చింది అనూరాధ.

'షికారు పోటానికి ఇంకా టైమ్ అవలేదా?' వినుగ్గా అడిగాడు.

సాయంతా ఇంట్లోనే ఉండి విసుగ్గా ఉంటుందనే రోజూ సాయంత్రం కారు డ్రైవ్ చేస్తూ షికారు తీసుకు వెళ్లటం మామూలు ఆమెకు.

రాత్రినుంచి ఆమె సరిగా మాట్లాడక పోవటం అతనికి మరీ విసుగ్గా అనిపించింది. నిన్న షికారు వెళ్లి వచ్చినప్పట్నించి ఆమె అలాగే ఉంది.

'నిన్న సాయంత్రంనుంచి సరిగా మాట్లాడటం లేదు. ఎందుకని? మనసు బాగా లేదా?' అదే అడిగాడు. నిజంగానే క్రిందటి సాయంత్రం టాంక్‌బండ్ మీద శివరావ్‌ని చూసినప్పట్నించి అనూరాధ మనసు అల్లకల్లోలంగా తయారయింది. మరుగున పడిపోయిన జ్ఞాపకాలు మనసుని తేనెటీగల్లా ముసురుతున్నాయి. తన పరధ్యాన్నాన్నిభర్త గ్రహించినందుకు తుళ్లిపడిం దామె మనసు. చేస్తున్న పని ఆపి దగ్గరగా వచ్చింది.

'నిన్నట్నించి ఒంట్లో కొంచెం నలతగా ఉంది. అంతకంటె వేరే కారణం లేదు. మీ సన్నిధిలో నాకు జీవితం నందనవనంలా ఉంటుంది. మనసు కలత చెందటానికి ఆస్కారమే లేదు!' భర్త భుజాలమీద చెయ్యి వేసి ఆప్యాయత నిండుకున్న స్వరంతో చెప్పింది.

'టైమెంత అయింది?' టేబుల్ మీద కూలింగ్ గ్లాసెస్ తడిమి తీసుకుంటూ అడిగాడు.

'సూర్యుడు ఓడిపోతూ ఉన్నాడు. ఎంతయి ఉంటుందో చెప్పుకోండి, చూద్దాం' అంది మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తూ.

'సరిగ్గా ఎంత కోణంలో ఉన్నాడో చెపితే చెపుతాను.'

'నా కంత నాలెడ్జి లేదుగానీ' అయిదుంబావయింది. చీర మార్చుకుని వస్తానుండండి, పోదాం!'

క్రిందికి వెళ్లి చీర కట్టుకుని, ముస్తాబయి వచ్చింది. కృష్ణమూర్తిని ఫ్రంట్ సీట్‌లో కూర్చోబెట్టి, పక్కనే డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంది. దారిలో ఎప్పటిలా పరిసరాల్ని వర్ణించి చెప్పలేకపోయింది ఎంత ప్రయత్నించినా. కారు టాంక్ బండ్ చేరుకునేసరికి సంధ్యాకాంతులు పరుచుకున్నాయి. దిగుతూనే చుట్టూ శివరావ్ కోసం గాలించా యామె కళ్లు. కనిపిస్తాడని ఏమాత్రం నమ్మకం లేకపోయినా ఎదురుగా నిన్నటి ప్రదేశంలోనే అతడిని చూసి ఆమె హృదయం ఎగిరి గంతేసింది. మోచేతులు గోడమీద ఆన్చి నీళ్లలోకి చూస్తూ నిలుచుని ఉన్నాడు.

'ఏమండీ, అక్కడ మా ఊరి అబ్బాయి ఉన్నాడు. మాట్లాడుతాం, రండి' అంటూ భర్త చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లింది.

'శివరావ్!'

వెనక్కి తిరిగి ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు.

'ఇక్కడే ఉంటున్నావా? ఎప్పుడూ కనిపించలేదేం?'

'ఊఁ. వచ్చి రెండు నెలలయింది. ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చాను' అంటూ కృష్ణమూర్తి వైపు చూశాడు.

'మా వారు. . . నువ్వు పెళ్లికి రానేలేదు కదూ?'

తానే అతని చెయ్యందుకుని, 'గ్లాడ్ టు మీట్ యు' అంటూ కరచాలనం చేశాడు శివరావ్. అనూరాధ కళ్లు వింత కాంతితో మెరిశాయి. ఆ వెలుగుకి అర్థమేమిటో అతనికి అర్థం కాక తికమకపడ్డాడు. కాసేపు కబుర్లు చెప్పుకున్న తరవాత ముగ్గురూ బయలుదేరారు.

'ఈ రోజు మా ఇంటికి రావలిసిందే' నని పట్టుబట్టింది రాధ. భార్య కోరికని బలపరిచాడు కృష్ణమూర్తి. చేసేది లేక కారెక్కాడు శివరావ్. భోజనా లవీ పూర్తవగానే కాసేపు మాట్లాడి నిద్రలోకి ఒరిగాడు కృష్ణమూర్తి. శివరావ్‌ని తీసుకుని మేడ మీదకు వెళ్లింది అనూరాధ.

గదులన్నీ చూపిస్తూ, 'పైన అంతగా వాడం, ఆయనకు మెట్లు ఎక్కడం, దిగడం కష్టమని' అంది. మాట్లాడుకుంటూ చివరి గదికి వచ్చారు. తలుపు గొళ్లెం తీస్తూ 'ఇది నీ గది' అని లోపలికి నడిచింది. ఆమెని అనుసరిస్తూ, ఎదురుగా అందమైన టేబుల్ క్లాత్ పరిచి ఉన్న బల్లమీద ఫోటో చూసి ఉలిక్కిపడ్డాడు. తను బి. ఎస్‌సి. లో తీయించుకున్న ఫోటో! ఆమె కది ఇచ్చిన విషయమే మరిచిపోయాడు. దానికి వేసి ఉన్న జాజిపూల దండ విరిసీ విరియని స్థితిలో మనోహరంగా ఉంది.

'అలా శిలాప్రతిమలా నిలుచుండిపోయావేం? ఇదుగో, పక్క ఇక్కడ వేయించాను. ఓ . . . ఫోటో చూస్తున్నావా? నీదేగా! అంతగా చూస్తున్నావేం?' అతని వైపు తిరిగి నవ్వుతూ చూసింది.

'అదే చూస్తున్నాను, నాది ఇక్కడెందుకు ఉందా అని. . .'

'ఉండకూడదని రూలేం లేదుగా! నువ్వీరోజు వచ్చావుగాని, అది నేను ఇక్కడ రానికి వచ్చినప్పట్నించి ఇక్కడే ఉంది.'

'నీ భర్త చూడలేడని ఇలా చేయటం తప్పు కాదా, రాధా?'

'ముమ్మాటికీ కాదు. దీనివలన అతనికే విధంగానూ అసంతృప్తి కలిగించటం లేదే? ఒకవేళ తప్పే అయినా అది సర్వం నీవేనని నమ్ముకుని మనసిచ్చిన నన్ను వయసులోని వ్యామోహంలో పడి తృణీకరించిన నీదే అవుతుంది!'

ఆమె మాటలకి శివరావ్ ముఖం వెలవెలబోయింది. వెంటనే తేరుకుంటూ, 'రాధా, ఒక్క మాట!' అన్నాడు.

'అయితే దీనికోసమేనా నన్ను తీసుకు వచ్చింది? ఇప్పటికే పశ్చాత్తాపంతో కృంగిపోతున్న నన్ను ఇంకా చిత్రవధ చేయకు. నీ ఆరాధనకి కృతజ్ఞతలు. నన్ను వెళ్లనీ.' విసురుగా లేచి నిలుచున్నాడు.

'వీల్లేదు, శివరావ్! రేపు ఉదయమే ఆయనతో చెప్పి వెళుదువుగాని. ఉన్నట్లుండి వెళ్లిపోతే ఆయన కేం సమాధానం చెప్పను?'

'అయితే, నేను చెప్పినట్లు చేస్తానని మాటివ్వాలి.'

'ఏమిటో చెప్పు?' అంది అతడి రాజీధోరణిని అంగీకరిస్తూ.

'నా మీద నిజంగా ప్రేమ ఉన్నట్లైతే ఈ క్షణంనుంచి నన్ను మరిచిపోవటానికి ప్రయత్నించు, రాధా! నా వలన పరోక్షంగానైనాసరే మరొక వ్యక్తికి అన్యాయం జరగటం సహించలేను!' బాధగా అన్నాడు. ఆమె చేతులు పట్టుకుని అర్థించాడు.

'క్షమించు, శివరావ్. నా కది సాధ్యం కాదు. నీ వలన ఆయనకి అన్యాయం జరుగుతుందని ఎలా అనుకుంటున్నావు? నువ్వు నా ఆరాధ్య దైవానివయితే, ఆయన నా ప్రత్యక్ష దైవం!'


నిశ్చలంగా ఉన్న ఆమె నిర్ణయాన్ని కాదనే సాహసం లేకపోయింది శివరావ్‌కి. అద్భుతమైన, అపురూపమైన దేవిని చూస్తున్నట్లు నిలబడిపోయాడు. ఆమెలో అతడు కోరుకున్న సౌందర్యాన్ని మించిన ఆకర్షణేదో శివరావ్ కళ్లకి కనిపిస్తూంది.

'నువ్వు దేవతవి కాదుగదా?' అప్రయత్నంగా పైకి అనేశాడు.

చిన్నగా నవ్వింది రాధ. 'కాదు. నమ్మించి మోసం చేసినా నిన్ను మరిచిపోలేని దౌర్భాగ్యురాలిని!'

కన్నీటిని దాచుకుంటూ అక్కణ్నించి వెళ్లిపోయిం దామె.

శూన్యమైన మనసుతో మళ్లీ ఒంటరిగా డయిపోయా డతడు.



గుత్తులు గుత్తులు

ఫోటో—ఎస్. పరమేశ్వర్ దాస్ (సికిందరాబాదు)